


# సౌందర్యము

[కథానిక]

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

నేను ఎప్పటిమోస్తరుగానే దినకృత్యాలు తీర్చుకొన్నాను. వాటిలో ఏమీ తేడా లేదు. పి. డబ్ల్యు. డి. ఆఫీసులో ఎప్పటి గుమాస్తాపనీ, సాయంత్రం ఎప్పటి దివ్యజ్ఞాన సమాజ మందిర దర్శనం — గుంటూరులో. ఉంటే ఈ కాస్త తేడా ఉండవచ్చు. మందిరంలో ఉండే జైన విగ్రహం దగ్గిర మరొక అయిదు నిమిషాలసేపు ఎక్కువ నిల్చుని తన్మయత్వంతో చూశాను.

అర్ధరాత్రయుంటుంది. రాత్రిపూట నాకు మెలుకువ వచ్చినప్పుడు ఎన్ని గంట లయిందో కొంత మందిలాగ చెప్పలేను. కాని అర్ధరాత్రయుంటుం దనుకొంటాను. ఎందుచేతంటే, అర్ధరాత్రిఘడియల లోనే దెయ్యాలూ, ఆత్మలూ భూమిమీదికి దిగుతాయని కొంతమంది చెప్తూంటే విన్నాను. అందుకని నాకు కలిగిన సన్నివేశమప్పుడు అర్ధరాత్రయుంటుంది.

నిద్రనుంచి ఎవరో తట్టగా లేచాను. కళ్లు తెరిచాను. ఏదో విగ్రహం ఎదుట ఉంది. అప్పు డేమీ భయం వెయ్యలేదు. నిద్రో, కలో, మెలుకువో తెలియ లేదు. మరోక్షణంలో ఆ తెల్లటి విగ్రహాన్ని చూసి భయ మనిపించింది. భయంలోనే "అబ్బే! మరేం కాదు, భ్రమ" అని విమర్శ. కళ్లు బాగా నులుపుకొని

ఈసారి తిన్నగా విగ్రహంవైపు చూడకుండా గదిలో ఉన్న పెద్ద ట్రంకుపెట్టె, నిశ్శబ్దంగా చిలక్కొయ్యని ఉన్న గుడ్డలు, ఎదుటి మేకున ప్రెస్‌లో ఉన్న రేకెట్, మూలఉన్న సన్నని ఇనప చేతిబెత్తం మొద లైనవి చూసి, మేలుకునే ఉన్నాననే విషయం ధ్రువపరుచుకుని, మళ్లీ ఎదుటఉన్న విగ్రహంవైపు చూశాను. తలకి ఒక్కమాటు నెత్తురు ఎక్కిపోయింది. ఆపాద మస్తకం గజ గజ లాడిపోయాను. కేక వేద్దా మని ఉద్దేశం. కేక వేసే ఉంటాను. కాని నాగొంతుక దాటి ధ్వని నాచెవులకే వినబడలేదు. ఆరడుగుల తెల్లటి విగ్రహానికి కళ్లు అప్పచెప్పి బెంబేరుగా కూచు న్నాను. క్రమేపీ విగ్రహం కొంచెం నల్లపడింది. భయా శ్చర్యాలతో చూస్తున్నాను. విగ్రహం మరీ నల్లపడింది. అది నల్లపడుతూండగా గదిలో వెలుగు ఎక్కువౌతూ న్నట్లుగా కనిపెట్టాను. వెలుగు విగ్రహం దగ్గిరనుంచే వస్తూంది. క్రమేపీ పట్టపగలులాగ ఉంది. అందులో నల్లటి ఇనములాంటి ఆకారం! నేను మరింత గాబరా పడ్డాను. పారిపోదా మనుకున్నాను. కాని అంగాలు నాస్వాధీనంలో లేకపోడంవల్ల బిక్కజచ్చికూచున్నా. అంతట్లో విగ్రహం గభీమని మారిపోయింది. మునుపటి నల్లటి ఆకారమేగాని ఈ మారు పీఠంమీద కూర్చు న్నట్లుగా ఉంది. నాకు చటుక్కున స్ఫురించింది ఇటువంటి దేదో వెనక చూసినట్టు. అట్టే ఆలో చించగా, నేను రోజూ చూస్తూన్నదే అనిపించింది. మరి కొంచెం ఆలోచించాను. రోజూ మందిరంలో చూస్తూన్న విగ్రహమే! పోల్చికట్టాను. అదిగో! చేతి మీద చెయ్యి వేసుకొన్న చేతులు, పాదంమీద పాదం వేసుకున్న కాళ్లు. అదే యజ్ఞోపవీతం, ఉత్త రీయం. అరడుగు పొడుగు చెవులు బుజాలకి తగులు తున్నాయి. నెత్తిమీద ముడిగా అమర్చిన ఉంగరాల జుట్టు. అదే తలవెనక పరివేషం. ధ్యానముద్రలో ఉన్న మొహం. నొసట బొట్టు. మెడమీది రేఖలు కూడా స్పష్టంగా కనబడుతున్నాయి. ఇంత పోలిక తర్వాత ఆశ్చర్యంతోపాటు విపరీతంగా భయంకూడా వేసింది. కాని క్రమేపీ భయం తగ్గింది. కారణ మేమి టంటే, నేను ప్రతిదినం దివ్యజ్ఞాన మందిరానికి వెళ్లి, ఎంతో భక్తి శ్రద్ధలతో పరిశీలించే విగ్రహమే అది. నాకు పూర్తిగా భయం తగ్గింది. కాని ఇది మాఇంటికి ఈ వేళప్పుడు ఎలాగ వచ్చింది అనే ఆశ్చర్యం బయలు దేరి, మళ్లీ భయం వేసింది. మళ్లీ ఇదంతా భ్రమేమో అని ఆలోచించాను. భ్రమ కాదని రుజువు చేసు కున్నాను. అదిగో! క్రమేపీ విగ్రహం మళ్లీ మారు తూంది. ఆశ్చర్యంతో కళ్లప్పచెప్పి చూశాను. నెమ్మది నెమ్మదిగా విగ్రహం తెల్లబడింది. నింపాదిగా గంభీ రంగా నిలబడింది. నేను జంకుతోటీ, ఆశ్చర్యంతోటీ చూస్తున్నా! ముక్కు చేత్తో పట్టుకున్నాడు జైన ముని. మబ్బుచాటునుంచి చంద్రుడు వచ్చినట్టుగా క్రమేపీ ఆయనకళ్లు విడ్డాయి. తేజోవంతా లయాయి నేను జడిశాను. పెదిమెలు కదిలినట్టయి మరింత భయ పడ్డాను.

మరొక క్షణంలో "అబ్బాయీ! గుర్తు పట్టేవా" అనే మాటలు వినబడ్డాయి. గుండె చెదిరి పోయింది. కాని నింపాదిగా తల ఆడించాను.

"మందిరంలోని విగ్రహం నాదే! అది నల్ల రాతితో చెక్కింది" అన్నాడు జైనముని శాంతంగా.

భయంలోనే నాకు కొంచెం గ్రహింపయింది— ఈయనిది పాలవంటి శరీరమనీ, అది నల్లరాతితో చెక్కారనీ!

మళ్లీ జైనముని మాట్లాడుతున్నాడు. "నేను నేడే సమాధినుంచి లేచాను. దివ్యదృష్టివల్ల నువ్వు నా భక్తుడ వని తెలుసుకున్నాను." అని ఉచ్చరించి ముక్కు చేత్తో పట్టుకున్నాడు.

నేను భయాశ్చర్యాలతో వింటూ చూస్తున్నాను.

"సమాధిలో ఉండిపోయి రెండువేల నాలుగు వందల సంవత్సరము లయింది."

అంతకాలాన్ని ఊహించ ప్రయత్నించాను. కాని మెదడు పనిచేయలేదు. భయకంపితు ణ్ణయాను.

"నా పేరు ఆనందతీర్థంకరు డంటారు" అని ముక్కు ఒక్కమాటు విడిచిపెట్టి మళ్లీ పట్టుకున్నాడు జైనముని.

ఆయన పేరు విని ఆశ్చర్యపడ్డాను. ఆశ్చర్యపడ్డందుకు భయపడ్డాను.

ఆనందతీర్థంకరుడు ముక్కు పట్టుకునే "మా కాలంలో చండతీర్థంకరుడు అన్నాడు: 'రెండువేల నాలుగువందల ఏళ్లకి భరతఖండంలో వామనకోతులు అనబడే ఒకజాతివారు బయలుదేరుతారు' అని. నిన్ను చూస్తూంటే నాకు ఆశ్చర్యం వేస్తూంది! చండతీర్థంకరుడు చెప్పినవాళ్లు మీరే! మీకూ అప్పటి వాళ్లకీ ఎంత భేద ముంది! మేము ఆజాను బాహువులం. మావాళ్లల్లో పొట్టివాణ్ణి నేనే. స్ఫురద్రూపులం! మమ్మల్ని గురించి ప్రాకృత గ్రంథాలలోని వర్ణనలు యథార్థంగా చేసినవే." అని ముక్కుపట్టు విడిచిపెట్టి మళ్లీ గభీమని పట్టుకున్నాడు మునీశ్వరుడు.

నాకు ఈముక్కుపట్టుభగిమం ఎంతమాత్రమూ బోధపడలేదు. కాని ఆశ్చర్యం బదులు భయంవేసింది. ఆనందతీర్థంకరుడు మళ్లీ "మీరుకూడా పుస్తకాలలో స్త్రీలనీ, పురుషులనీ వర్ణిస్తారా" అని స్ఫుటంగా, నెమ్మదిగా అన్నాడు.

తల ఊపాను.

"మాట్లాడు" అని నన్ను ఎంతో కాలంనుంచీ ఎరిగినవాడిలాగు అన్నాడు జైనముని.

నాకు బోలెడంత భయం వేసింది.

"మాటలో చెప్పాలి నాకు" అని మళ్లీ నెమ్మదైన ధ్వని వినబడింది.

మాట్లాడకుండా ఉండలేకపోయాను. "ఉ, ఉ" అన్నాను.

"మాటల్లోనే చెప్పు" అని దిట్టమైన నెమ్మది స్వరం.

కట్ట తెగిన ప్రవాహంలాగ అప్రయత్నంగా నాకు మాటల ధోరణి వచ్చింది. భయం ఎప్పటికంటే ఎక్కువయింది. కాని వాక్కును ఆపుకోలేకపోయాను. "వర్ణిస్తాము" అన్నాను.

"ఏమని?" అని చిన్న ప్రశ్న.

ఒక చెంపని భయపడుతూన్నా, నాకు వాగ్జాలం ఆగకపోగా, గడగడలాడుతూ—

"మేము స్త్రీల మొహాలు, చేతులు, పాదాలు పద్మాలలాగ ఉంటాయని—"

తీర్థంకరుడి మొహం సూర్యోదయంలాగ నెమ్మదిగా ఎర్రబారుతూంది. నేను భయపడి "మీకు అంత కోపం వచ్చే మాటలు చెప్పినందుకు నన్ను క్షమించ ప్రార్థిస్తున్నాను" అని చెప్పి నా వాచాలతకీ, చొరవకీ వణికిపోయాను.

తీర్థంకరుడు అన్నాడు: "కోపం వచ్చిన మాట వాస్తవమే కాని, వామనకోతీ, మీ స్త్రీలమొహాలు గాని, చేతులు గాని, కాళ్లు గాని నిజంగా పద్మాలలాగ అందంగా ఉండే వర్ణిస్తారా? మాకాలపు కవులు వర్ణించేరంటే, స్త్రీలు ఆమోస్తరుగా ఉండేవారు. కాబట్టి వర్ణించేవారు. అంతేకాని ఇప్పటిలాగు అబద్ధాలు రాయలేదు. అందుకూ కోపం వచ్చింది. తర్వాతవిషయం చెప్పు కోతీ!"

"కోతీ" అని పిలిచినందుకు నాకు కొంచెం నొప్పి కలిగింది. ఏమీ అనలేక ఊరుకున్నాను. ఆనందం నటించ దలచుకొన్నాను కాని నటించలేకపోయాను.

"ఎందుకు ఊరుకున్నావు చెప్పక" అని ప్రశ్నించాడు ముని, నాఊహ ఎరిగినవాడిలాగ.

"నేను యథార్థం చెప్పడానికి భయపడి ఊరుకున్నాను స్వామీ!" అన్నాను దీనంగా.

"వామనకోతీ! ఎందుకు ఊరుకున్నావు, చెప్పక" అని బిగింపుస్వరంతో తీర్థంకరుడు పలికాడు.

మళ్లీ నానోటిమాటలు అప్రయత్నంగా వచ్చాయి. "కోతీ అని పిలిస్తే నాకు సిగ్గువేస్తూంది" అన్నాను. అన్నందుకు జడిసిపోయాను.

జైనమునికి పరమఆశ్చర్యం వేసింది. ముక్కుపట్టు వదిలి, చూపుడువేలు ఒక్కక్షణం ముక్కుమీద పెట్టుకున్నాడు. తెరుచుకున్న నోరు అలాగే ఉండిపోయింది. చివరికి ఆయన "చండతీర్థంకరుడు చెప్పిన మాటలు నేను చెప్పాను. రెండువేల నాలుగువందల

ఏళ్లతర్వాత భరతఖండ మంతటా వామనకోతులు కోట్ల కొలది ఉంటారని ఆయన చెప్పిన మాట నా చెవుల్లో ఇప్పటికీ వినబడుతూంది. నేను అంటూన్నమాటలు ఆయన అన్నవే!" అని నాబాధకి ఆశ్చర్యం కనబరిచాడు.

తీర్థంకరుడు అన్న మాట యథార్థమే అయుంటుందని నే నింకేమీ నొచ్చుకోలేదు. ఆయన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "వామనకోతీ! ఇంకా మీకవులు ఏమని వర్ణిస్తారు? ముఖ్యంగా కళ్లనిగురించి ఏమని వర్ణిస్తారో చెప్పు" అన్నాడు కొంచెం కుతూహలం కనబరిచి.

"కళ్లు తామర రేకులలాగు —" స్వామివారి మొహం ఎఱ్ఱదనం చూసి నా పెదిమెలు మూతపడి పోయాయి. సాయంత్రం పడమటి ఆకాశంలాగ ఉంది ఆయన మొహం.

"చెప్పవేమి" అన్నాడు జైనముని గొంతుక బిగింపుతోటీ, అదరుతూన్న పెదిమెలతోటీ.

"ఎఱ్ఱకలువలలాగ ఉన్న తమ మొహం చూసి మాట్లాడలేను" అన్నాను జడుపుగిడుపు లేక. అని, నా ధైర్యాన్ని తలుచుకొని కంపించాను.

జైనముని నిదానంగా బిగువుగా "మా కాలంలో అబద్ధాలు చెప్పడం ఎరగము. నువ్వు మాట్లాడేవి అబద్ధాలు. అందుచేత నాకు అణుచుకోలేనంత కోపం వస్తూంది" అన్నాడు, కొంచెం ఆయాసంతో, తొందరగా వస్తూన్న ఊపిరితో.

ఆయనవాక్కులలో ఉన్న శాంతం నన్ను ఇనుముని అయస్కాంతంలాగ ఆకర్షించివేయగా, ముందువెనుకలు చూడని చొరవతో "స్వామీ! నన్ను మీద కోప్పడవద్దు. మాకవులు చేసే వర్ణనలు చెప్పాను గాని నేను కల్పించి చెప్పలేదు" అన్నాను.

ఆయన పెదిమెలు మొదట బిగించి, పిమ్మట నెమ్మదిగా విప్పి, సన్నగా "మీకవులసంగతే నేను చెప్పిన విషయమున్నూ. ఆమోస్తరుగా నువ్వే వర్ణన చేసుంటే భస్మంచేసిఉందును. నాభక్తుడు అబద్ధాలు పలికితే నేను ఊరుకోలేను!" అన్నాడు.

ఈ మాటలు విన్న నాకు ఒకవైపు భయం లాగుతూన్నా, ఆయనమీద భక్తివిశ్వాసాలు అధికమయాయి.

స్వామివారు "ఇంకా చెప్పు కోతీ!" అని సెలవు ఇచ్చారు.

'కోతీ' అన్న మాట వినగా ఎంచేతో చిన్నతన మనిపించింది. "స్వామీ! నా పేరు సుందరమూర్తి" అన్నాను జడుపులేక.

తీర్థంకరుడికి ఆకాశ మంటుకున్నంత కోపం వచ్చింది. కాని శాంతమైన వాక్కులు నానోటినుంచి రావడంవల్లే, నేను బతికున్నాను అని ఇప్పటికీ నా నమ్మకం.

ఆయన ఎంతో నెమ్మదిగా "నువ్వు సుందరమూర్తివా!" అన్నాడు. చిరునవ్వుకళ మెరుస్తూన్న పెదిమెలతో సంధ్యాసమయంలో నీరెండలాగ కాంతివంతంగా ఉంది ఆయనమొహం.

"నా పేరు స్వామీ!" అని దీనంగా అన్నాను.

"అదే నే నడగడం. నువ్వు సుందరమూర్తివా?" అన్నాడు ముని కళ్లలో నవ్వు తొంగిచూడగా.

"నాపే రది స్వామీ!"

"నే నడగడం అదే. నీలో ఏమి సౌందర్య ముందని నువ్వు సుందరమూర్తివి?"

నేను మొదట గాబరాపడ్డాను. కాని జైనముని అవస్థ నాకు కొంచెం గోచరమయింది. సుందరంగా ఉన్నప్పుడే 'సుందరమూర్తి' అని పేరుపెట్టాలనీ, లేకపోతే పెట్టకూడదనీ ఆయనఊహ. అది తెలిసిన పిమ్మట నేను "నాతల్లిదండ్రులు నాకు ఆపేరు ఏర్పరిచారు స్వామీ!" అన్నాను, చేతులు జోడించి,వినయవిధేయతలతో.

"కోతీ! నిన్ను వాళ్లు కళ్లతో చూసే పేరు పెట్టారా?" అన్నాడు ముని కొంచెం దిట్టమైన స్వరంతో.

"స్వామీ! నేను ఎరగను"

"ఇటువంటి అబద్ధపుపేర్లు ఎలాగ పెడతారు? మా కాలంలో ఎరగమే? మీకవులలోకూడా ఇలాంటి పేర్లు ఉంటాయా?"

"స్వామీ! ఉంటాయి."

"చెప్పు కొన్ని, వామనకోతీ!"

స్వామివారి ఆజ్ఞప్రకారం అన్నాను: "శేష, వెంకట, కృష్ణ, సూర్య, సత్య, సుబ్బ, శంకర, రామ—ఇటువంటిపదాలకు ముందూ వెనకా ఏవేవో చేర్చి పెడతారు."

మళ్లీ తీర్థంకరుడు అగ్నిహోత్రుడయిపోయాడు.

నానోటంబడి "స్వామీ! నావల్ల దోషమేదేనా ఉంటే తమరు క్షమించి, రక్షించమని ఈమూర్ఖుడు ప్రార్థిస్తున్నాడు" అని స్వామివారి పాదకమలాలమీద వాలాను.

తీర్థంకరుడు చెయ్యెత్తి అభయహస్తమిచ్చాడు.

నేను లేచాను. తర్వాత ఆయన "ఈ కాలంలో శివుడు, రాముడు, కృష్ణుడు ఏరీ? వాళ్లు వెనకటికాలంలో ఉండేవారు" అన్నాడు ముక్తసరిగా.

తీర్థంకరుడి అవస్థ నాకూ, నాఅవస్థ తీర్థంకరుడికీ బోధపడలేదని నాకు కొంత గోచరమయింది. ఆతర్వాత ఆలోచించకుండానే "తమ కాలంలో పేర్లు రెండు సెలవియ్యండి స్వామీ!" అని మొండి ధైర్యంతో అనేసి, అధైర్యపడ్డాను.

"నాతమ్ముళ్ల ఇద్దరి పేర్లూ సుకీర్తి, విచిత్రప్రకృతి. సుకీర్తి చిన్నప్పుడు చాలా దుడుకుగా ఉండడంవల్ల దుష్టబుద్ధి అనేవారు. అతను క్రమేపీ మారిపోయి గొప్పగొప్ప పనులు చేసి సుకీర్తి అయాడు. విచిత్రప్రకృతి చిన్నప్పటినుంచీ ఒక్క మోస్తరుగా లేడు" అన్నాడు తీర్థంకరుడు, వచనధోరణి మొండిగా ముగిస్తూ.

జైనముని సెలవిచ్చిన సంగతినిబట్టి నాకు బాగా బోధపడింది—మనిషి పేరు ఏదో పెట్టడం కాదనీ, అతని ప్రవర్తనవల్లే క్రమేపీ లోకంలో పేరు ఏర్పడుతుందనీ. ఈవిషయం గ్రహించాక నేను జైనముని ఆగ్రహం పూర్తిగా అర్థంచేసుకొన్నాను. నాపేరు చూసి సుందరమూర్తి అని ఎలాగ పేరుపెట్టారో అని ఆశ్చర్యపోయాను. నాతల్లిదండ్రులమీద హద్దులేనంత కోపం వచ్చింది. "దుర్మార్గులు!"

"వామనకోతీ! ఏమిటీ ఆలోచిస్తున్నావు?"

ఆలోచనలు తెగి "స్వామీ! తాము చెప్పినదంతా మననం చేసుకొంటున్నాను. ఈ దీనుడు తన పేరు తమకి చెప్పి నొప్పి కలిగించినందుకు తమ పాదములపై బడి ప్రార్థిస్తున్నాడు" అని స్వామివారి పాదాలమీద పడ్డాను.

భయం లేదన్నట్టు తీర్థంకరుడు చెయ్యెత్తాడు. నేను లేచాను.

"ఇంకా మీకవులు ఏమని వర్ణిస్తారు?" అని ఎంతో కుతూహలం కనబరిచి అడిగాడు ముని.

"మాకవులు కచకుచాదులు, కంఠం, నడుము, నితంబం మొదలైనవాటిని వర్ణిస్తారు మహాత్మా!" అన్నాను.

"ఏమని?—మీ పొట్టి తలవెంట్రుకల్ని ఏమని వర్ణిస్తారు?"

"తాచుపాములాగ పొడుగ్గా ఉన్నాయని"


జైనమునికోపం తారాపథం అంటుకుపోయింది. వడగళ్లు పడ్డట్టు పట పట మంటూన్న పళ్ల సందునుంచి సన్నని దిట్టమైన మాటలు వినవచ్చాయి "మీకవులు తుచ్ఛులు, మోసగాండ్రు, అబద్ధపరులు" ఈ మాటలు వచ్చి ఆయన పెదిమెలు గులాబీరేకుల్లాగ దగ్గరపడిపోయాయి. మరికొంత సేపటికి "ఇంకా..." అనే మాట చెవిని పడగా తుళ్లిపడి "స్వామీ! తమకి అయిష్టమైన విషయాలు చెప్పినందుకు నన్ను రక్షించమని దేవరవారి పాదాలకి నమస్కరిస్తున్నాను." అని చాలాసార్లు నమస్కారం చేశాను.

ఫర్వా లేదన్నట్టుగా తీర్థంకరుడు చెయ్యి ఆడించాడు. సాయంత్రం సూర్యుడు నీటిలో ప్రతి

ఫలించినట్టు ఉన్న ఆయన మొహం క్రమేపీ చంద్ర బింబంలాగ, తెల్లకలువలాగ, నక్షత్రలోకంలాగ శాంతి వంత మయింది. అమృతంలాంటి వాక్కులు వెలు వడ్డాయి.

“క్షాంతీ! మీ కవుల వర్ణనలు ఇంక చెప్పవద్దు. వామనకోశల కవుల వర్ణనలకీ, మా కాలపు కవుల వర్ణనలకీ చాలా వ్యత్యాస ముంది. మాకవులు ఉన్న విషయాలు ఉన్నట్లు వర్ణిస్తారు. వామనకోతికవులు అబద్ధాలు రాస్తారు” అన్నాడు తీర్థంకరుడు స్పష్టంగా.

ఇంతటి అన్యాయపు చేష్టలకి నాజాతి తరఫున నేను క్షమాపణ కోరుదామనుకొన్నాను కాని తీర్థంకరుడు “మరోకమారు వస్తా” నని చెప్పి, చటుక్కున అదృశ్యుడైపోయాడు. నేను చివరిసారి నమస్కరించనేనా లేదు. ఎంత అపరాధం చేశానో అని భయభ్రాంతుణ్ణయి అలాగే కూచోపడిపోయాను.



పురమందిరము, కొలంబో